క్లుప్తంగా

అంగరలో రక్తదాన శిబిరం



అంగరలో రక్తదానం చేస్తున్న దాత

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వాసవీ క్లబ్, వనిత క్లబ్, వీకేఎస్‌పీ, వారియర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలోని అశిరాంబిక అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన శిబిరాన్ని వాసవీ క్లబ్స్ జిల్లా గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. రక్తదానం చేసిన దాతలకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. శిబిరంలో వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ బ్యాంక్‌కు చెందిన వైద్యులు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్స్ విభాగాల నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

బాధితురాలికి రూ.15వేల ఆర్థిక సాయం

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గ్రామ శివారు చిన్న కోరుమిల్లి గ్రామంలో పెరాలసిస్ బాధితురాలికి జనసేవాదళ్ సభ్యులు రూ.15వేలు సమకూర్చారు. ఈ సాయాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ చేతుల మీదుగా బాధితురాలు చీకట్ల లక్ష్మీ పార్వతికి అందజేశారు.

రామచంద్రపురం ఆర్డీఓకు అదనపు బాధ్యతలు



ఆర్డీఓ ఎస్.సుధాసాగర్

రామచంద్రపురం: రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్‌కు కొత్తపేట ఆర్డీఓగా మంగళవారం పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. కొత్తపేట ఆర్డీఓ, ఆ డివిజన్‌లోని ముగ్గురు తహసీల్దార్లకు రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాలు, వరదల సహాయ పునరావాస చర్యల్లో పాల్గొనే విధంగా వారికి కలెక్టర్ డిప్యుటేషన్ వేయడంతో కొత్తపేట ఆర్డీఓగా సుధాసాగర్‌ను నియమించారు.

తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి

కాజులూరు: గ్రామాల్లో తొలకరి పంట సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలని శలపాక రైతు సేవాకేంద్రం వీఏఏ వి.అనూష అన్నారు. మంగళవారం గ్రామంలో ఆమె రైతులతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వ్యవసాయశాఖ సిబ్బంది పంటల నమోదు పూర్తి చేశామన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రానికి వచ్చి వేలిముద్రలు వేయడం లేదా ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, సెల్‌ఫోన్ తీసుకురావాలన్నారు. ఈ-కేవైసీ లేని పక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తించవన్నారు.

50 లీటర్ల సారాతో నిందితుడి అరెస్టు



పట్టుబడిన సారా, నిందితుడితో మండపేట రూరల్ పోలీసులు

మండపేట: మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లి రోడ్డులో హీరో హోండాపై సారా తరలిస్తున్న చిటికెన శ్రీను అనే వ్యక్తిని మంగళవారం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ పీతల దొరరాజు కథనం ప్రకారం శ్రీను తుంగపాడు నుంచి జెడ్.మేడపాడు బైక్‌పై వస్తున్నాడు. అనుమానంతో పోలీసులు శ్రీనును ఆపి, అతడి వాహనాన్ని సోదా చేయగా ప్లాస్టిక్ సంచిలో దాచి ఉంచిన 50 లీటర్ల సారా ప్యాకెట్లు బయట పడ్డాయి. రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది అతడి బైక్‌ను సీజ్ చేసి, సారా ప్యాకెట్లను స్వాధీనం చేన్నారు. నిందితుడ్ని కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు తెలిపారు.

90 శాతం ఈ-పంట నమోదు పూర్తి



ఓదూరు ఆర్బీకేలో రైతులకు ఈ-కేవైసీ చేయిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలో ఈ-పంట నమోదు 90 శాతం పూర్తయినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ఓదూరు రైతు భరోసా కేంద్రం వద్ద ఈ-పంట, ఈ-కేవైసీ నమోదు ప్రక్రియలను ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ఈ-పంట, ఈ-కేవైసీలు నమోదు చేసుకోవడం వల్ల ప్రయోజనాలను రైతులకు వివరించి, త్వరగా నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వి.సాయిప్రసన్న, ఎ.విమల, రైతులు పాల్గొన్నారు.

ఎన్నెన్నో రూపాలు.. ఊరూరా సందళ్లు

- కొలువుతీరేందుకు సిద్ధమవుతున్న గణనాథులు
- నెల ముందుగానే ఆర్డర్లు
- ఖర్చుకు వెనుకాడని ఉత్సవ కమిటీలు
- అనుమతులు తప్పనిసరి అంటున్న పోలీసులు



కొలువు తీరేందుకు సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు

రాయవరం: భక్తులతో పూజలు అందుకునేందుకు రకరకాల ఆకృతుల్లో వినాయక ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ నెల ఏడో తేదీ శనివారం వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సన్నద్ధం అవుతున్నారు. దేవుడు జీవరాశులకు ప్రాణం పోస్తుంటే..అదే దేవుడి రూపాలకు రాజస్తాన్ కళాకారులు ప్రాణం పోస్తున్నారు. ఎలుక వాహనం ఎక్కిన వినాయకుడు, గోపీకృష్ణ, పార్వతీ పరమేశ్వరుల చెంత, ఎలుక వాహనంపై, నెమలి, సింహం, ఏనుగు, గోవు, సర్పం, నాట్యాకృతి, త్రిశూలంలో.. ఇలా వివిధ రూపాల్లో చూడచక్కటి రూపాల్లో.. రంగుల్లో వినాయక విగ్రహాలను తీర్చిదిద్ది అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు.

జోరుగా చందాల వసూలు..

గణేశుడి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఉత్సవ కమిటీలు సన్నద్ధం అవుతున్నాయి. ఇప్పటికే ఉత్సవ కమిటీలు గణనాథుని విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చేందుకు, ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చందాలు వసూళ్లు చేపట్టాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన విగ్రహాల సంస్కృతి ఇప్పుడు పల్లెలకూ విస్తరించింది. దీంతో పరోక్షంగా విగ్రహాల తయారుచేసే వారికి ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఏటా విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. గ్రామాల్లో వీధి వీధికో ఉత్సవ కమిటీ ఏర్పడుతోంది. మరోవైపు కొందరు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

లడ్డూలకు పెరిగిన డిమాండ్

విగ్రహాల సంస్కృతి పెరిగినట్టు గానే గ్రామాల్లో ఉత్సవ కమిటీలు గణనాథుల చెంత లడ్డూలను ఏర్పాటు చేసే పనిలో ఉన్నారు. ఒకప్పుడు పట్టణాల్లో మాత్రమే ఉంటే లడ్డూల సంస్కృతి ఇప్పుడు పల్లెల్లోనూ బాగా విస్తరించింది. వినాయకుడితో పాటుగా నవరాత్రుల లడ్డూలకు పూజలు చేసి, వాటిని వేలం పాడడం భక్తుల నమ్మకానికి ప్రతీకగా ఉంది. లడ్డూలను ఏర్పాటు చేసేందుకు ఉత్సవ కమిటీలు, భక్తులు స్వీట్ స్టాల్స్‌లో ఆర్డర్లు ఇస్తున్నారు. ఒక్కొక్కరు తమ ఆర్థిక స్థోమతను అనుసరించి ఐదు నుంచి 50 కేజీల వరకు లడ్డూలకు ఆర్డర్లు ఇస్తున్నట్లు స్వీట్ స్టాల్ యజమానులు తెలిపారు.

పోలీసుల అనుమతి పొందాలిలా..

వినాయక ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. వినాయక ఉత్సవాలకు అన్ని రకాల అనుమతులూ మంజూరు చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అగ్నిమాపక, పురపాలక, విద్యుత్, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ పొందాలి. 79950 95800 అనే వాట్సాప్ నంబర్ ద్వారా లేదా హెచ్‌టీటీపీఎస్:గణేష్ ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు పూర్తి చేయాలి. మీ సేవలో చలానా రుసుం చెల్లించి, అనుమతులు పొందాలి. అనుమతులను క్యూఆర్ కోడ్‌ను లామినేషన్ చేసి, ఉత్సవాలు నిర్వహించే పందిరిలో డిస్‌ప్లే చేయాలి. తనిఖీలకు వచ్చే అధికారులకు క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచాలి. అనుమతులు పొందాలనుకునే వారు 7995095800 వాట్సాప్ నంబరుకు హాయ్ అని టైప్ చేస్తే ఫోన్‌కు లింక్ వస్తుంది. లింక్‌పై క్లిక్ చేసిన తర్వాత ఓటీపీ వస్తుంది. అనంతరం అప్లికేషన్‌కు గూగుల్ ఫామ్ ఓపెన్ చేసి, అందులోని కాలమ్స్‌ను పూర్తి చేసి సబ్మిట్ చేయాలి. పోలీసులు వెరిఫై చేసిన అనంతరం సింగిల్ విండో విధానంలో పర్మిషన్ మంజూరు చేస్తారు.



పోలీసులు అనుమతి ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

మట్టి విగ్రహానికే ప్రాధాన్యం



పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆరేళ్లుగా మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠిస్తున్నాం. ఈ ఏడాది కూడా ఆరు అడుగుల మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నాం. రాజమహేంద్రవరంలో మట్టి విగ్రహాల తయారీదార్లకు ఆర్డరు ఇచ్చాం. అలాగే 11 కేజీల లడ్డూను ఉత్సవ కమిటీ ఏర్పాటు చేస్తోంది.

– వెలంపాలెపు శివకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, లొల్ల, రాయవరం మండలం

అనుమతులు తప్పనిసరి



ప్రతి ఉత్సవ కమిటీ విధిగా అనుమతులు పొందాలి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు అనుమతులు తీసుకోవాలి. సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నాం. ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాల్సి ఉంది.

– పి.దొరరాజు, మండపేట రూరల్ సీఐ

వేతనాలు పెంచాలంటూ ఆశా వర్కర్ల ధర్నా



డివిజనల్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ప్రశాంతికి వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలంటూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మండలంలోని అన్ని పీహెచ్‌సీల వద్ద మంగళవారం ధర్నాలు నిర్వహించి వైద్యాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలకా సుభాషిణి ఆధ్వర్యంలో 33 మంది ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. నాయకులు సుభాషిణి, దేవి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనం పెంచాలని, ఈ ఏడాది ఫిబ్రవరి 9న ప్రభుత్వం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలను అమలు చేస్తూ వెంటనే జీఓలు, సర్క్యులర్‌లు జారీ చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు నిలుపుదల చేసిన ఒప్పంద జీఓలను వెంటనే విడుదల చేయాలన్నారు. పని భారం తగ్గించాలని కోరారు. పనిచేయని సెల్‌ఫోన్లు తీసుకుని నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, 60 సంవత్సరాల వయస్సు వచ్చిన ఆశా వర్కర్లను 62 సంవత్సరాలకు పెంచిన జీఓ వచ్చే వరకు తొలగించకూడదని డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు.

దాడి ఘటనపై కేసు నమోదు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో జరిగిన దాడి ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం, సోమేశ్వరానికి చెందిన కర్రి వీరమణికంఠ అదే గ్రామానికి చెందిన కుబేరుడు అనే వ్యక్తి వద్ద రూ.మూడు వేలు అప్పుగా తీసుకున్నాడు. వారంవారం వడ్డీ చెల్లిస్తుండగా, రెండు వారాలుగా చెల్లించలేకపోయాడు. దీంతో కుబేరుడు తన వడ్డీ సొమ్ము ఇవ్వాలంటూ సోమవారం వీరమణికంఠను అడగ్గా, మరునాడు ఇస్తానని బదులిచ్చాడు. దీనికి ఆగ్రహించిన కుబేరుడు సోమవారం రాత్రి వీరమణికంఠను కొట్టి గాయపరిచాడు. దాంతో వీరమణికంఠ రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చేరాడు. రామచంద్రపురం ఏరియా ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుజ్జిబాబు తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా పురోగతి సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ అఖిల్ మెహ్రోత్రా, సంస్థ ప్రతినిధులు

కాజులూరు: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పురోగతి సాధించాలని పైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (పీఐఎల్) మేనేజింగ్ డైరెక్టర్ అఖిల్ మెహ్రోత్రా అన్నారు. మంగళవారం కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో పీఐఎల్ సంస్థ రూ.10 లక్షలు విలువైన 78 డ్యూయల్ డెస్కులు, మూడు కంప్యూటర్లు, ఒక ఓవర్ హెడ్ ప్రొజెక్టర్లను మేనేజింగ్ డైరెక్టర్ అఖిల్ మెహ్రోత్రా, సంస్థ చీఫ్ ఆపరేటివ్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌లు విద్యార్థులకు అందజేశారు. స్కూల్ హెచ్ఎం పంపన కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో తమ సంస్థ అనేక ప్రోత్సాహాలను అందిస్తుందన్నారు. వసతులు సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు డేవిడ్, జాన్, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, పీఐఎల్ సంస్థ ప్రతినిధులు పినపోతు ధర్మారావు, తోట సతీష్, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతన్నా..సమయం లేదన్నా..

- ఈ నెల 15తో ముగియనున్న ఈ క్రాప్ నమోదు గడువు
- ఇప్పటి వరకు 86.28 శాతం పంట నమోదు
- ఈకేవైసీ 19.8 శాతం మాత్రమే



క్షేత్ర స్థాయిలో పంటలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సహాయకులు

రాయవరం: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులకు నష్టాలు తప్పడం లేదు. కనీసం పెట్టుబడి అయినా చేతికందని పరిస్థితి. గతంలో సరైన వివరాలు నమోదు చేయక పంట నష్టపరిహారం అందేది కాదు. అలాంటి సమయాల్లో రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ నూతన సాంకేతిక విధానాన్ని ప్రవేశ పెట్టింది. దీనిని ప్రారంభించిన తొలి రోజుల్లో ఈ-పంట యాప్ ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన శాఖల వారు నమోదు ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత పూర్తిగా వ్యవసాయశాఖ అధికారులే ఈ-పంట నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల వర్తింపు, రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలతో పంట దెబ్బతింటే నష్టపరిహారం పొందడానికి, మార్కెట్‌లో మద్దతు ధర దక్కకపోతే రైతులను ఆదుకునేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా మారింది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులను పంట పొలంలో నిలబెట్టి ఫొటో తీసి, వాటిని అప్‌లోడ్ చేసే ప్రక్రియ చేపడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఈ పంట నమోదు ప్రక్రియ ఈ నెల 15తో గడువు ముగియనున్న నేపథ్యంలో రైతులు త్వరపడాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

నూతన విధానంలో యాప్

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదుకు నూతన విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానంలో మండల వ్యవసాయాధికారులు సర్వే నంబర్లను వెబ్‌ల్యాండ్ నుంచి డౌన్‌లోడ్ చేసి, గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులకు సర్వే నంబర్లను కేటాయిస్తారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సర్వే నంబర్లను ఈ-కర్షక్ వెబ్ లాగిన్‌లో అప్‌డేట్ చేసుకుంటారు. అనంతరం ఈ-కర్షక్ మొబైల్ యాప్‌లో జియో ఫెన్సింగ్ డౌన్ లోడ్ చేసుకుని పంట నమోదు ప్రక్రియ ప్రారంభిస్తారు. ఒక సర్వే నంబర్‌కు వెళ్లినపుడు ఆ సర్వే నంబర్ జియో కోఆర్డినేట్స్ ఓపెన్ అవుతాయి. సర్వే నిమిత్తం వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయి సర్వే నంబర్‌కు వెళ్తేనే యాప్ ఓపెన్ అవుతుంది.

మండలం	విస్తీర్ణం	ఈ-పంట నమోదు	శాతం
కపిలేశ్వరపురం	17,541	15,359	81.01
కె.గంగవరం	17,113	14,067	82.02
మండపేట	18,005	14,898	82.75
రాయవరం	14,454	12,716	87.98
రామచంద్రపురం	18,299	16,659	91.04

జియో ఫెన్సింగ్‌తో అనుసంధానం

గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈ-కర్షక్ యాప్ జియో ఫెన్సింగ్‌తో అనుసంధానం అయి ఉంటుంది. ఇప్పటి వరకూ ఉపయోగించే ట్యాబ్‌లో అటెండెన్స్‌తో పాటు రోజువారీ విధుల వివరాలు, రైతు బీమా, రైతుబంధు అప్‌డేట్ నమోదు చేసేవారు. ఇందులోనే ఈ-క్రాప్ బుకింగ్ చేసేవారు. అయితే క్షేత్ర స్థాయి వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పంటల వివరాలు నమోదు చేసే విధంగా ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం నూతనంగా మార్పులు చేసింది. సర్వే నంబర్‌కు వెళ్లినపుడు మాత్రమే వివరాలు కన్పించేలా మాడ్యూల్‌ను రూపొందించింది. సర్వేకు వెళ్లినపుడు గూగుల్‌లో జియోఫెన్స్ ద్వారా ఆ లొకేషన్‌కు చేరుకుంటారు. 200 మీటర్ల దూరంలో ఉన్నపుడు మాత్రమే సర్వే నంబర్ వివరాలు యాప్‌లో కన్పిస్తాయి. అప్పుడే నమోదు చేయాల్సి ఉంటుంది.

క్లస్టర్‌లో పరిస్థితి ఇదీ

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పరిధిలో 85,412 ఎకరాల్లో 50,273 మంది రైతులు ఖరీఫ్ వరిసాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం ఇప్పటి వరకూ క్లస్టర్ పరిధిలో 73,699 ఎకరాల్లో 86.28 శాతం మేర ఈ-పంట నమోదు చేశారు. రైతుల బయో మెట్రిక్‌ను తీసుకున్న తర్వాత మాత్రమే పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్టుగా భావిస్తారు. ఇప్పటి వరకూ 5,991 మంది రైతులు 12,932 ఎకరాలకు ఈకేవైసీ పూర్తి చేయించుకున్నారు.

రైతులు త్వరపడాలి



రాయవరం మండలంలో ఇప్పటి వరకూ 86.28 శాతం మేర ఈ-పంట నమోదు చేశాం. ఇప్పటి వరకూ నమోదు చేసుకోని రైతులు త్వరపడాలి. ఈ-పంట నమోదుతోనే రైతులకు ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలకు అర్హులవుతారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలి. లేకుంటే ఈపంట నమోదు పూర్తి కానట్లే. ఈ విషయాన్ని రైతులు గమనించాలి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



మాచవరం పీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు పెరగకుండా వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. మాచవరం పీహెచ్‌సీలో మంగళవారం కన్వర్జెన్సీ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. జ్వరాలపై ఎప్పటికప్పుడు సర్వే చేయించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి ఎంపీపీ సూచించారు. అలాగే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులతో అవేర్‌నెస్ సమావేశాన్ని నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో శానిటేషన్ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బ్లీచింగ్, సున్నం చల్లించాలని, దోమల నిర్మూలనకు ఎబేట్, మలాథియాన్ స్ప్రే చేయించాలని సూచించారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాస్, మణికంఠ, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయవరంలో బీజేపీ సభ్యత్వ నమోదు



రాయవరంలో బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నేతలు

రాయవరం: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును మంగళవారం రాయవరంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర పదాధికారి కర్రి చిట్టిబాబు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, సభ్యత్వ కో కన్వీనర్ కోన సత్యనారాయణ, అసెంబ్లీ నియోజకవర్గ ఇనన్‌చార్జ్ కోటిపల్లి సాయిరామ్, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు నరాల రాంబాబు, వల్లభనేని రవీంద్రబాబు, గొడవర్తి రామచంద్రరావు, మద్దుల సుబ్బారావు, పాలిక రమణ, ఈరెల్ల కృష్ణమూర్తి, చిరట్ల సుబ్బారావు, పిల్లి సత్యనారాయణ, ముప్పాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్తలకు నిండుశోకంతో ఘన నివాళి



మామిడికుదురులో మర్షియా ఆలపిస్తూ గుమ్మటాల ఊరేగింపు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హసన్, మహ్మద్ ప్రవక్తల షహదత్‌ను మంగళవారం ముస్లింలు నిండుశోకంతో నిర్వహించారు. దీనిలో భాగంగా ఇమామ్ హసన్, మహ్మద్ ప్రవక్తల గుమ్మటాలను మామిడికుదురు, నగరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. ముస్లింలు గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. సర్కిల్ పర్వత్ అలీబేగ్ ఆధ్వర్యంలో మర్షియా ఆలపించారు. నగరం బడేబీబీ పంజా వరకు ఈ గుమ్మటాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. బడే బీబీ పంజాలో షహదత్ మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకులు మహ్మద్ తఖీ మజ్లిస్‌లను ఆలపించారు. అనంతరం గుమ్మటాలను శాంతపర్చారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ముస్లింలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రవక్తలకు శ్రద్ధాంజలి ఘటించారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అంబాజీపేటలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీను

అంబాజీపేట: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జనకళ్యాణ్ టీఐ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శ్రీను, పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్‌లు అన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అనుమతితో కోనసీమ జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శ్రీను మాట్లాడుతూ గ్రామాల్లో ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన మందులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రత్నకుమారి, జనకల్యాణ్ స్టాఫ్ నర్స్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

జీవన నాణ్యతను మెరుగుపరుచుకోవాలి

అంబాజీపేట: పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రిబల్) గ్రూప్ సభ్యులైన చెంచులు వారి జీవన నాణ్యతను, శ్రేయస్సును మెరుగుపర్చుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారం, వక్కలంక గ్రామాల్లో సర్పంచ్‌లో దొంగ నాగేశ్వరరావు, వాసంశెట్టి రేవతిల అధ్యతన పీఎం ఏడబ్ల్యూఏఎస్ (ప్రధాన మంత్రి జనజాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ పీవీటీజీ గ్రూపు సభ్యులైన వారికి ప్రధాన మంత్రి జనజాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా 11 రకాల సౌకర్యాలు కల్పించనున్నారన్నారు. పక్కా ఇళ్లు, మంచి నీటి కుళాయి, రహదారుల నిర్మాణం, నాణ్యమైన విద్య, విద్యుత్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారన్నారు. ట్రిబల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బేస్‌లైన్ సర్వేలను నిర్వహించడం ప్రారంభించిన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వాసంశెట్టి పెదబాబు, ఈఓపీఆర్డీ బి.మమత, ఉపాధి ఏపీఓ ఏవీ కృష్ణ, ఎంఈఓ-1 కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.తాతాజీ పాల్గొన్నారు.

చేతి వృత్తుల వారిని ఆదుకోవాలి



తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మకు వినతిపత్రం ఇస్తున్న చేతి వృత్తుల సంఘం నాయకులు

అయినవిల్లి: చేతి వృత్తుల వారిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు కోనసీమ జిల్లా దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్, చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘం నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కార్పెంటర్లు, చేతి వృత్తుల వారి సమస్యలను సంఘ సభ్యులతో కలసి తహసీల్దార్ లక్ష్మమ్మకు వివరించారు. రెడీమేడ్ ఫర్నిచర్, మొదలైన వస్తువుల తయారీతో తాము పూర్తిగా నష్టపోతున్నామన్నారు. కార్పెంటర్లు, చేతి వృత్తిదారులకు జీవనోపాధి లేక రోడ్డున పడుతున్నామన్నారు. పస్తులతో కాలం వెళ్లదీస్తున్నామన్నారు. తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో పితాని బి.రావు, గున్నేపల్లి భీమశంకరం, కొండపల్లి షణ్ముఖరావు, పూడి శివ గంగాధర్, కొపనాతి తాతాజీ తదితరులు ఉన్నారు.